సాక్షి
కుమురం భీం

బుధవారం । 5 । జూన్ । 2024



గెలుపొందిన అనంతరం నగేశ్‌కు ధ్రువీకరణ పత్రం అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి రాజర్షి షా

గరిష్టం/కనిష్టం 38.4 /28.3

వాతావరణం

ఆకాశం చాలావరకు మేఘావృతమై ఉంటుంది. ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. రుతుపవనాల ప్రభావంతో అక్కడక్కడా వర్షం కురిసే అవకాశం ఉంది.

ఆదిలాబాద్ పార్లమెంట్ విజేత గొడం నగేశ్ (బీజేపీ)
వచ్చిన ఓట్లు : 5,68,168
మెజార్టీ : 90,652

రెండో స్థానం: ఆత్రం సుగుణ (కాంగ్రెస్)
వచ్చిన ఓట్లు : 4,77,516

మూడో స్థానం : ఆత్రం సక్కు (బీఆర్ఎస్)
వచ్చిన ఓట్లు: 1,37,300

- ఎంపీగా గెలిచిన గొడం నగేశ్
- నిర్మల్, ముధోల్‌లో బీజేపీకి భారీ మెజార్టీ
- ఖానాపూర్, సిర్పూర్, ఆదిలాబాద్, బోథ్‌లో స్వల్పమే..
- 'అసెంబ్లీ'తో పోల్చితే అధిక ఓట్లు సాధించిన కాంగ్రెస్
- ఒక్క ఆసిఫాబాద్‌లోనే సుగుణకు లీడ్
- చీలిన బీఆర్ఎస్ ఓటు.. బీజేపీ, కాంగ్రెస్‌కు టర్న్



విజయోత్సవ సంబురం..: ఎంపీగా గెలుపొందిన తర్వాత విక్టరీ సింబల్ చూపుతున్న గొడం నగేశ్, ఎమ్మెల్యే శంకర్

మళ్లీ కమలమే..





కౌంటింగ్ కేంద్రంలో ఓట్లను లెక్కిస్తున్న ఎన్నికల సిబ్బంది

సాక్షి,ఆదిలాబాద్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో కమలం పార్టీ మళ్లీ వికసించింది. ఆ పార్టీ అభ్యర్థి గొడం నగేశ్ భారీ మెజార్టీతో గెలిచారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ పోటీనిచ్చినప్పటికీ భారీ ఓట్ల వెనుకంజలో నిలిచారు. అయితే అసెంబ్లీ ఎన్నికలప్పుడు ఆ పార్టీకి వచ్చిన ఓట్లతో పోల్చుకుంటే సుగుణకు భారీగా ఓట్లు లభించాయి. ఇక బీఆర్ఎస్ అభ్యర్థి ఆత్రం సక్కుకు డిపాజిట్ మాత్రమే దక్కింది. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఈ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో అత్యధిక ఓట్లు సాధించిన కారు పార్టీని ఈ ఎన్నికల్లో మాత్రం ఓటర్లు ఆదరించలేదు. ఆ పార్టీ ఓట్లు బీజేపీ, కాంగ్రెస్ వైపు మళ్లాయి.

మొదటి రౌండ్ నుంచే ఆధిక్యం..

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో మంగళవారం ఉదయం 8 గంటలకు ఎన్నికల ఓట్ల కౌంటింగ్ మొదలైంది. ఆదిలాబాద్, బోథ్ నియోజకవర్గాలకు సంబంధించి టీటీడీసీలో, నిర్మల్, ఖానాపూర్, ముధోల్‌కు సంబంధించి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో, ఆసిఫాబాద్, సిర్పూర్‌లకు సంబంధించి సాంఘిక సంక్షేమ బాలికల జూనియర్ కళాశాలలో కౌంటింగ్ నిర్వహించారు. ఆదిలాబాద్‌లో ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజర్షిషా ఆధ్వర్యంలో సాగగా, మిగతా కేంద్రాల్లో అసిస్టెంట్ రిటర్నింగ్ అధికారుల సమక్షంలో కొనసాగింది. ఈవీఎంల మొదటి రౌండ్ ఫలితం ఉదయం 9గంటల సమయంలో వెలువడింది. ఈ పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలోని అన్ని నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు పూర్తయ్యే సరికి సాయంత్రం 4 గంటలైంది. కాగా బీజేపీ అభ్యర్థి గొడం నగేశ్ మొదటి రౌండ్ నుంచే భారీ ఆధిక్యం సాధిస్తూ వచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణ 11, 14, 16, 17 రౌండ్‌లలో స్వల్ప ఆధిక్యత సాధించారు. అయితే బీజేపీ విజయాన్ని అడ్డుకోలేకపోయారు. ఇదిలా ఉంటే ఆదిలాబాద్ ఎంపీగా గొడం నగేశ్ ఎన్నికైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రాజర్షిషా ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. సాయంత్రం ఆదిలాబాద్‌లో బీజేపీ విజయోత్సవ ర్యాలీ నిర్వహించింది.

ఆ రెండింటితోనే భారీ మెజార్టీ..

బీజేపీకి సిర్పూర్, ఖానాపూర్, ఆదిలాబాద్, బోథ్, నిర్మల్, ముధోల్ నియోజకవర్గాల్లో మెజార్టీ లభించింది. అయితే మొత్తం మెజార్టీలో నిర్మల్, ముధోల్‌ల్లోనే భారీ ఆధిక్యం లభించింది. ఈ రెండు నియోజకవర్గాల్లో మొదటి రౌండ్ నుంచి కమలం పార్టీకి లభించిన ఓట్లతో మిగతా నియోజకవర్గాల్లో కాంగ్రెస్‌కు ఆధిక్యం వచ్చినా కనబర్చలేకపోయింది. మొత్తంగా ఎమ్మెల్యేలు ప్రాతినిధ్యం వహిస్తున్న ఆదిలాబాద్, నిర్మల్, ముధోల్, సిర్పూర్‌లలో బీజేపీ ప్రాబల్యం చూపింది. అంతేకాకుండా కాంగ్రెస్ ఎమ్మెల్యే ప్రాతినిధ్యం వహిస్తున్న ఖానాపూర్‌లోనూ బీజేపీకే లీడ్ దక్కింది. ఒక్క ఆసిఫాబాద్ నియోజకవర్గంలో మాత్రమే ఆత్రం సుగుణకు అత్యధిక ఓట్లు లభించాయి.

నియోజకవర్గాల వారీగా మెజార్టీ వివరాలు

నియోజకవర్గం	మెజార్టీ(పార్టీ)
సిర్పూర్	8,369 (బీజేపీ)
ఆసిఫాబాద్	26,940 (కాంగ్రెస్)
ఖానాపూర్	13,519 (బీజేపీ)
ఆదిలాబాద్	5,338 (బీజేపీ)
బోథ్	4,914 (బీజేపీ)
నిర్మల్	43,850 (బీజేపీ)
ముధోల్	37,833 (బీజేపీ)

రౌండ్‌ల వారీగా ప్రధాన పార్టీలకు వచ్చిన ఓట్లు, మెజార్టీ వివరాలు..

రౌండ్ నంబర్	బీజేపీ	కాంగ్రెస్	బీఆర్ఎస్	మెజార్టీ (పార్టీ)
1	28,429	19,623	5,660	8,806 (బీజేపీ)
2	29,702	18,182	5,979	11,520 (బీజేపీ)
3	27,659	20,328	6,532	7,331 (బీజేపీ)
4	23,976	19,668	7,027	4,308 (బీజేపీ)
5	23,967	23,138	7,439	829 (బీజేపీ)
6	24,194	22,142	5,804	2,052 (బీజేపీ)
7	23,998	21,195	6,605	2,803 (బీజేపీ)
8	26,756	18,287	5,813	8,469 (బీజేపీ)
9	22,098	19,831	6,707	2,267 (బీజేపీ)
10	24,095	21,497	5,266	2,598 (బీజేపీ)
11	26,130	26,200	5,589	70 (కాంగ్రెస్)
12	23,512	20,882	6,942	3,378 (బీజేపీ)
13	23,881	20,134	5,815	3,747 (బీజేపీ)
14	26,918	27,179	5,752	261 (కాంగ్రెస్)
15	27,486	22,042	5,036	5,444 (బీజేపీ)
16	21,441	21,446	5,914	05 (కాంగ్రెస్)
17	23,812	23,911	5,032	99 (కాంగ్రెస్)
18	28,253	22,445	5,700	5,768 (బీజేపీ)
19	28,961	22,305	6,441	6,656 (బీజేపీ)
20	24,769	21,241	6,824	3,528 (బీజేపీ)
21	23,756	20,080	6,379	3,676 (బీజేపీ)
22	18,521	15,068	6,379	3,453 (బీజేపీ)
23	5,789	4,353	1,736	1,436 (బీజేపీ)

బీజేపీ గెలుపు సంబరాలు

ఆదిలాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడంతో ఆ పార్టీ ఆధ్వర్యంలో సంబరాలు జరుపుకున్నారు. ఆదిలాబాద్ ఎంపీగా పార్టీ అభ్యర్థి గొడం నగేశ్ గెలుపొందడంతో ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఇతర నాయకులు ఆయనకు అభినందనలు తెలిపారు. పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి హౌసింగ్‌బోర్డ్ కాలనీలోని నగేశ్ నివాసం వరకు విజయోత్సవ ర్యాలీ చేపట్టారు. డీజే చప్పుళ్లు, కార్యకర్తల నృత్యాల నడుమ జోరుగా సాగింది.

భారీ బందోబస్తు

ఆదిలాబాద్‌టౌన్: పార్లమెంట్ ఎన్నికల కౌంటింగ్ సందర్భంగా జిల్లా కేంద్రంలో మంగళవారం భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆదిలాబాద్ పట్టణంలోని టీటీడీసీ, పాలిటెక్నిక్ కళాశాల, ప్రభుత్వ బాలికల గురుకుల పాఠశాలల్లో కౌంటింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఐలవ్‌యూ ఆదిలాబాద్ సెల్ఫీ పాయింట్ నుంచి పాలిటెక్నిక్ కళాశాల వరకు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఆ ప్రాంతంలో ఎవరినీ అనుమతించలేదు. కౌంటింగ్ ఏజెంట్లను, పాస్‌లు ఉన్నవారిని క్షుణ్ణంగా తనిఖీ చేసి లోనికి పంపించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా నిఘా పెట్టారు. 1,100 మంది పోలీసులతో గట్టి బందోబస్తు చేపట్టారు. ఎస్పీ గౌస్ ఆలం కౌంటింగ్ కేంద్రాలను పరిశీలించారు. అలాగే పట్టణంలో మద్యం దుకాణాలను మూసి ఉంచేలా చర్యలు చేపట్టారు. లెక్కింపు ప్రక్రియ ముగిసేంత వరకు అప్రమత్తంగా వ్యవహరించారు. ఎస్పీతో పాటు డీఎస్పీలు, సీఐలు, ఎస్సైలు పర్యవేక్షించారు.



బందోబస్తును పరిశీలిస్తున్న ఎస్పీ గౌస్ ఆలం


ఆదిలాబాద్ ఎంపీ సెగ్మెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2019, 2024లలో పార్టీల వారీగా పోలైన ఓట్ల వివరాలు..

నియోజకవర్గం	బీజేపీ		బీఆర్ఎస్		కాంగ్రెస్	
	2019	2024	2019	2024	2019	2024
సిర్పూర్	24,047	71,325	60,740	19,840	47,355	62,956
ఆసిఫాబాద్	44,874	47,056	47,401	38,597	43,793	73,996
ఖానాపూర్	47,320	75,106	30,481	18,520	60,748	61,587
ఆదిలాబాద్	63,169	82,394	47,594	16,265	37,803	77,056
బోథ్	61,094	70,118	42,850	22,472	36,392	65,204
నిర్మల్	61,172	1,06,770	45,387	8,181	46,617	62,920
ముధోల్	75,216	1,05,334	44,212	12,505	41,349	67,501
మొత్తం	3,76,892	5,58,103	3,18,665	1,36,380	3,14,057	4,71,220

మొన్నటి అసెంబ్లీ.. గత, ప్రస్తుత పార్లమెంట్ ఎన్నికల పోలింగ్ వివరాలు..

ఎన్నికలు	మొత్తం ఓట్లు	పోలైన ఓట్లు	శాతం
అసెంబ్లీ- 2023	16,25,101	13,07,563	80.46
పార్లమెంట్- 2019	14,88,353	10,62,895	71.41
పార్లమెంట్- 2024	16,50,175	12,21,563	74.03

2023 అసెంబ్లీ ఎన్నికల్లో నియోజకవర్గాల వారీగా పోలైన ఓట్లు..



- జిల్లాలో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థికి మెజార్టీ
- 'సిర్పూర్'లో బీజేపీ హవా.. 'ఆసిఫాబాద్'లో హస్తం జోరు
- అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే బీఆర్ఎస్‌కు భారీగా తగ్గిన ఓట్లు
- అన్ని పార్టీలకు కలిసి రాని వలసలు

తీర్పు విలక్షణం



ఆసిఫాబాద్: లోక్‌సభ ఎన్నికల్లో జిల్లా ఓటర్లు విలక్షణ తీర్పునిచ్చారు. ఆదిలాబాద్ పార్లమెంట్ వ్యాప్తంగా బీజేపీ హవా కొనసాగినా.. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో కాంగ్రెస్ అభ్యర్థి ఆత్రం సుగుణకు మెజార్టీ దక్కింది. నియోజకవర్గాల పరంగా మాత్రం సిర్పూర్‌లో కమలం హవా కొనసాగగా, ఆసిఫాబాద్ ఓటర్లు హస్తం వైపు మొగ్గు చూపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఆసిఫాబాద్ నియోజకవర్గ ఓటర్లు బీఆర్ఎస్‌కు పట్టం కట్టగా, తాజాగా కాంగ్రెస్‌కు మెజార్టీ ఇచ్చారు. ఆసిఫాబాద్‌లో తొలి రౌండ్ నుంచి కాంగ్రెస్‌కు ఆధిక్యం లభించగా, సిర్పూర్‌లో బీజేపీ గాలి వీచింది. 23 రౌండ్ల ఓట్ల లెక్కింపు అనంతరం ఆసిఫాబాద్‌లో కాంగ్రెస్ అభ్యర్థి 73,996 ఓట్లు, బీజేపీ అభ్యర్థి 47,056, బీఆర్ఎస్ అభ్యర్థి 38,597 ఓట్లు సాధించగా.. నోటా 2,717 ఓట్లు పడటం విశేషం. లెక్కింపు అనంతరం కాంగ్రెస్ అభ్యర్థి సుగుణకు 26,940 ఓట్ల మెజార్టీ లభించింది. ఇక సిర్పూర్‌లో హస్తం పార్టీ 62,956 ఓట్లు సాధించగా.. కమలం పార్టీ 71,325, బీఆర్ఎస్ 19,840 ఓట్లు సాధించాయి. నోటాకు 2,017 ఓట్లు వచ్చాయి. ఇక్కడ బీజేపీ 8,369 ఓట్ల ఆధిక్యం సాధించింది. మొత్తంగా రెండు నియోజకవర్గాల్లో కలిపి జిల్లాలో కాంగ్రెస్‌కు 18,571 ఓట్ల మెజార్టీ దక్కడం విశేషం.

మారిన సమీకరణాలు

గత అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుతం జిల్లా ఓటర్ల తీర్పు మారింది. ఆసిఫాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థుల మధ్య ప్రధాన పోటీ ఉండగా, బీఆర్ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి కాంగ్రెస్ అభ్యర్థి అజ్మీరా శ్యాంనాయక్‌పై విజయం సాధించారు. ఇక్కడ మొత్తం 80.97 శాతం ఓట్లు పోలయ్యాయి. 2,26,664 మంది ఓటర్లలో 1,84,725 మంది ఓటుహక్కు వినియోగించుకున్నారు. కోవ లక్ష్మి 83,052 ఓట్లు, శ్యాంనాయక్ 60,242 ఓట్లు సాధించగా.. కోవ లక్ష్మికి 22,810 ఓట్ల మెజార్టీ దక్కింది. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో ఆసిఫాబాద్ నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు 13,754 ఓట్లు పెరగడం గమనార్హం. బీఆర్ఎస్‌కు మాత్రం 44,455 ఓట్లు తగ్గాయి. ఇక సిర్పూర్ నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల్లో 2,26,874 మంది ఓటర్లకు 1,86,880 మంది ఓటేశారు. బీజేపీ అభ్యర్థి పాల్వాయి హరీశ్‌బాబుకు 63,702 ఓట్లు, బీఆర్ఎస్ అభ్యర్థి కోనేరు కోనప్పకు 60,614 ఓట్లు, బీఎస్పీ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు 44,646 ఓట్లు వచ్చాయి. సమీప ప్రత్యర్థి కోనప్పపై హరీశ్‌బాబు 3,088 ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. అసెంబ్లీ ఎన్నికలతో పోలిస్తే ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 7,623 ఓట్లు పెరగగా, బీఆర్ఎస్‌కు 50,774 ఓట్లు తగ్గాయి.

ప్రభావం చూపని చేరికలు

అసెంబ్లీ ఎన్నికల అనంతరం జిల్లా రాజకీయాల్లో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో నిలవగా.. బీఆర్ఎస్ నుంచి కోవ లక్ష్మి, బీజేపీ నుంచి పాల్వాయి హరీశ్‌బాబు విజయం సాధించారు. ఆ తర్వాత జరిగిన పరిణామాలతో జిల్లాలోని కీలక నాయకులు, ద్వితీయ శ్రేణి నేతలు అధికార పార్టీ తీర్థం పుచ్చుకుని హస్తం గూటికి చేరారు. ముఖ్యంగా సిర్పూర్ మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప, ఆయన సోదరుడు ఇన్‌చార్జి జెడ్పీ చైర్మన్ కోనేరు కృష్ణారావు వారి అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. బీఆర్ఎస్‌లో సముచిత స్థానం దక్కడం లేదనే అసంతృప్తితో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, ఆసిఫాబాద్ జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు కాషాయ కండువా కప్పుకున్నారు. వీరి చేరికలు ఆయా పార్టీలకు ఓట్లు రాలుస్తాయని అంతా భావించారు. అయినా మంత్రి సీతక్క, డీసీసీ అధ్యక్షుడు విశ్వప్రసాద్‌రావు, నియోజకవర్గ ఇన్‌చార్జి శ్యాంనాయక్‌తోపాటు నాయకుల సమష్టి కృషితో ఆసిఫాబాద్‌లో కాంగ్రెస్ ఆధిక్యత చూపింది. ఉదయం తొలిరౌండ్ నుంచి హస్తం పార్టీనే మెజార్టీ సాధిస్తూ వచ్చింది. ఇక సిర్పూర్ బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు చరిష్మా మరోసారి పని చేసింది. ఇక్కడ కూడా తొలిరౌండ్ నుంచి కమలం పార్టీనే ఆధిక్యంలో కొనసాగింది. మొత్తంగా జిల్లాలో కాంగ్రెస్‌కే అధిక ఓట్లు వచ్చినా ఆ పార్టీ అభ్యర్థి మాత్రం విజయం సాధించలేకపోయారు.

'సిర్పూర్'లో బీజేపీ.. 'ఆసిఫాబాద్'లో కాంగ్రెస్

రౌండ్ల వారీగా ప్రధాన పార్టీలు సాధించిన ఓట్లు, మెజార్టీ

ఆసిఫాబాద్ నియోజకవర్గం

రౌండ్	కాంగ్రెస్	బీజేపీ	బీఆర్ఎస్	మెజార్టీ
1	3,674	3,489	960	185(కాంగ్రెస్)
2	3,368	2,957	1,185	411(కాంగ్రెస్)
3	3,052	2,467	1,447	585(కాంగ్రెస్)
4	3,016	1,760	1,907	1,256(కాంగ్రెస్)
5	4,876	2,638	1,750	2,238(కాంగ్రెస్)
6	3,128	2,561	1,567	5,67(కాంగ్రెస్)
7	3,214	1,375	1,656	1,839(కాంగ్రెస్)
8	3,002	2,440	1,358	562(కాంగ్రెస్)
9	1,697	1,684	1,942	245(బీఆర్ఎస్)
10	3,727	1,489	1,830	1,897(కాంగ్రెస్)
11	2,418	3,575	1,845	1,157(బీజేపీ)
12	2,944	673	2,749	195(కాంగ్రెస్)
13	2,146	691	2,171	259(బీఆర్ఎస్)
14	4,128	4,276	1,285	148(బీజేపీ)
15	4,518	2131	1337	2,387(కాంగ్రెస్)
16	2,549	1,781	1,630	768(కాంగ్రెస్)
17	4,204	1,896	1,541	2,308(కాంగ్రెస్)
18	3,314	2078	1,477	1236(కాంగ్రెస్)
19	4,135	1,908	2,509	1626(కాంగ్రెస్)
20	3,373	1,886	2,174	1,199(కాంగ్రెస్)
21	3,653	1,469	1,927	1,726(కాంగ్రెస్)
22	3,158	1,645	1,760	1,398(కాంగ్రెస్)
23	675	187	590	85(కాంగ్రెస్)

సిర్పూర్ నియోజకవర్గం

రౌండ్	కాంగ్రెస్	బీజేపీ	బీఆర్ఎస్	మెజార్టీ
1	1,968	5,073	529	3,105(బీజేపీ)
2	1232	6843	379	5611(బీజేపీ)
3	2,623	2,869	684	246(బీజేపీ)
4	3,148	4,345	725	1,197(బీజేపీ)
5	3,462	3,927	413	465(బీజేపీ)
6	3,730	2,765	709	965(కాంగ్రెస్)
7	3,383	2,655	443	728(కాంగ్రెస్)
8	3,350	2,245	646	1,105(కాంగ్రెస్)
9	2,690	1,625	674	1,065(కాంగ్రెస్)
10	2,752	3,502	771	750(బీజేపీ)
11	2,552	2,428	940	124(కాంగ్రెస్)
12	3,358	3,001	1,189	357(కాంగ్రెస్)
13	4,052	2,620	598	1,432(కాంగ్రెస్)
14	3,248	2,841	993	407(కాంగ్రెస్)
15	2,511	4,706	1,184	2,195(బీజేపీ)
16	2,304	1784	1560	520(కాంగ్రెస్)
17	2,697	2,047	1,006	650(కాంగ్రెస్)
18	2,001	2,868	1,188	867(బీజేపీ)
19	2,749	2,446	1,019	303(కాంగ్రెస్)
20	2,611	2,357	1,195	254(కాంగ్రెస్)
21	1,958	2,850	1,212	892(బీజేపీ)
22	2,176	2,329	867	153(బీజేపీ)
23	2,101	2,900	916	799(బీజేపీ)

ఆలయంలో 'గొడం' పూజలు

ఆదిలాబాద్: ఆదిలాబాద్ లోక్‌సభ స్థానాన్ని బీజేపీ కైవసం చేసుకుంది. ఈ మేరకు ఎంపీగా ఎన్నికైన గొడం నగేశ్ జిల్లా కేంద్రంలోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి హారాన్ని సమర్పించి, వేద పండితుల ఆశీర్వచనాలు స్వీకరించారు. ఎంపీగా విజయం సాధించిన నగేశ్‌కు ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, సిర్పూర్ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు, ముధోల్ ఎమ్మెల్యే రామారావు పాటిల్ తదితరులు అభినందనలు తెలిపారు.



పూజలు చేస్తున్న నగేశ్, బీజేపీ ఎమ్మెల్యేలు

క్లుప్తంగా

తరలిపోతున్న రేషన్ బియ్యం?



ట్రాలీలో లోడ్‌చేస్తున్న పీడీఎస్ బియ్యం

నస్పూర్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రేషన్ దుకాణాల ద్వారా తెల్ల రేషన్ కార్డులు కలిగిన కుటుంబాలకు సరఫరా చేస్తున్న రేషన్‌బియ్యం పక్కదారి పడుతున్నాయి. సోమవారం రాత్రి కొందరు వ్యక్తులు షిర్కే కాలనీలోని ఓ రేషన్ షాపు నుంచి క్వింటాళ్ల కొద్దీ పీడీఎస్ బియ్యాన్ని ట్రాలీలో తరలిస్తున్నట్లు స్థానికులు గుర్తించారు. అధికార పార్టీకి చెందిన ఓ కౌన్సిలర్ బంధువుల షాపు నుండే బియ్యం తరలించినట్లు తెలుస్తోంది. రేషన్ షాప్‌కు స్టాక్ వచ్చిన రెండు రోజులకే అక్రమంగా తరలించడం చర్చనీయాంశమైంది.

ప్రహరీ కూలి పోలీసులకు గాయాలు

జైనూర్: రెండు దుకాణాల మధ్య ఉన్న ప్రహరీ కూలి బందోబస్తు విధులు నిర్వహిస్తున్న పోలీసులపై పడటంతో గాయాలైన సంఘటన మంగళవారం మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్సై సందీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండల కేంద్రంలో ఎన్నికల కౌంటింగ్‌లో భాగంగా విధులు నిర్వహిస్తున్న పోలీసులు ఓ దుకాణంలో కూర్చున్న నేపథ్యంలో రెండు దుకాణాల నడుమ నిర్మించిన ప్రహరీ కూలడంతో నలుగురికి గాయాలయ్యాయి. జైనూర్ ప్రభుత్వాసుపత్రిలో ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం ఆదిలాబాద్‌లోని రిమ్స్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు పట్టివేత

ఆసిఫాబాద్‌రూరల్: అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న ఐదు ట్రాక్టర్లను మంగళవారం పట్టుకున్నట్లు సీఐ సతీష్ తెలిపారు. మండలంలోని సాలెగూడ వద్ద ఇసుకతో వస్తున్న ట్రాక్టర్లను ఆపి అనుమతి పత్రాలు అడిగితే లేవని చెప్పడంతో డ్రైవర్ కం ఓనర్‌పై సెక్షన్ 379 ఐపీసీ మైన్స్ మినరల్ యాక్ట్ కింద కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

షార్ట్‌సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం



దగ్ధమవుతున్న ఇల్లు


భైంసారూరల్: మండలంలోని సిద్దూర్‌లో పంచశీల, సురేశ్ దంపతులకు చెందిన ఇల్లు మంగళవారం విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో దగ్ధమైంది. గ్రామానికి చెందిన పంచశీల సురేశ్ దంపతులు రేకులతో వేసిన షెడ్డులో నివసిస్తున్నారు. ఉదయం ఇంటికి తాళంవేసి కూలీ పనులకు వెళ్లారు. కొద్దిసేపటి తర్వాత ఇంట్లో నుంచి పొగలు రావడం గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. నిత్యవసర సరుకులు, బట్టలు కాలిబూడిదయ్యాయి.

అడవుల సంరక్షణతోనే మనుగడ

- అంతరిస్తే వాతావరణంలో పెనుమార్పులు
- వర్షాలు పోయి కరువు సంభవించే ప్రమాదం
- నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం



ఇటీవల కోతకు గురైన టేకు చెట్టు



కవ్వాల్ అభయారణ్యం

జన్నారం: అడవులు అంతరిస్తే ఆమ్లవర్షాలు కురిసి అనర్థాలకు దారితీస్తుంది. చెట్లను పెంచితేనే మానవాళికి మనుగడ. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటుకోవాల్సిన అవసరం ఉంది. భూమిపై పెరుగుతున్న కాలుష్యంతో ఓజోన్ పొర దెబ్బతిని మనిషి మనుగడకు కష్టంగా మారే ప్రమాదం ఉంది. తాను కూర్చున్న చెట్టు కొమ్మను తాను నరుక్కునే మూర్ఖుడిలా పర్యావరణాన్ని కాపాడే అడవులను కొందరు నరికివేస్తూ స్వార్థానికి వాడుకుంటున్నారు. పర్యావరణంపై అవగాహన పెంచడానికి 1972 జూన్ 5న ఐక్యరాజ్య సమితి సమావేశం ఏర్పాటు చేసి యునైటెడ్ నేషన్స్ జనరల్ అసెంబ్లీ ద్వారా ప్రపంచ పర్యావరణ దినోత్సవంగా ప్రకటించింది. 1973 జూన్ 5న మొదటిసారి ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకున్నారు. అప్పటి నుంచి ప్రతీ సంవత్సరం పర్యావరణ దినోత్సవాన్ని జరుపుకుంటున్నారు. నేడు ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

అంతరిస్తున్న అడవులు

ఆదిలాబాద్ జిల్లా అంటే అడవుల జిల్లా అని, పచ్చదనానికి చిరునామాగా పేరు గాంచింది. కవ్వాల్ పులుల రక్షిత ప్రదేశం. 893 చదరపు కిలోమీటర్ల కోర్ ఏరియాగా 1123.25 చదరపు కిలోమీటర్ల బఫర్ ఏరియాలో వ్యాపించి ఉంది. ఇక్కడ విలువైన టేకు కలప ఉంది. పలు రకాల చెట్లకు, వివిధ రకాల వన్యప్రాణులకు చిరునామాగా నిలుస్తోంది. కానీ కొన్నేళ్లుగా పచ్చని అడవిపై గొడ్డలి వేటు పడుతోంది. దట్టమైన అడవులను పచ్చిక బయల్లుగా మార్చే కుట్ర జరుగుతోంది. కొందరు స్మగ్లర్లు తమ స్వలాభం కోసం పచ్చని అడవులపై గొడ్డలి వేటు వేస్తున్నారు. ఇలాగే కొనసాగితే మన దేశంలో వన సంపద ఉండేది..అడవులు ఉండేవి.. అని చెప్పుకునే రోజులు వచ్చే ప్రమాదం ఉంది.

పర్యావరణ రక్షణ ఎవరి బాధ్యత?

రోజురోజుకూ భూమిపై కాలుష్యం పెరిగితే మానవుని మనుగడకు ముప్పు వాటిల్లుతుంది. సూర్యుని నుండి వెలువడే అతి ప్రమాదకరమైన అతినీల లోహిత కిరణాల బారినుంచి కాపాడే ఓజోన్ పొర కాలుష్య కోరల వల్ల దెబ్బతినే అవకాశం ఉంది. ఒకవేళ ఓజోన్ పొర దెబ్బతింటే నేరుగా అతినీల లోహిత కిరణాలు భూమిపై పడితే వేడికి మనుషులు, పక్షులు, జంతువులు మాడిపోయే ప్రమాదం ఉంది. ఈ ప్రమాదకరమైన సంఘటన జరుగకుండా చూడాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. భూమిపై పెరుగుతున్న నీటి కాలుష్యం, వాయు కాలుష్యం, శబ్ద కాలుష్యాన్ని తగ్గించి, విరివిగా మొక్కలు నాటాలి.. అడవులను రక్షించుకోవాలి.

పచ్చదనం పెంపునకు నడుం బిగించాలి

తరుగుతున్న అడవులను తిరిగి పెంచేందుకు గత ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఏటా హరితహారం పథకం కింద కోట్లాది మొక్కల పెంపకం చేపట్టింది. గ్రామాల్లో నర్సరీలను ఏర్పాటు విరివిగా మొక్కలు పెంచే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పర్యావరణం దెబ్బతింటే భూమిపై నివసించే మనుషులు, జంతువులు, పక్షులు, అన్ని జీవరాశులకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఉంది. పెరుగుతున్న కాలుష్యం ఒకవైపు, పెరుగుతున్న ప్లాస్టిక్ వినియోగం మరోవైపు పర్యావరణ కాలుష్యానికి దోహదం చేస్తున్నాయి. కాలుష్యాన్ని తగ్గించాలంటే పచ్చదనం పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

బాధ్యతగా తీసుకోవాలి



పర్యావరణాన్ని కాలుష్యం చేయకుండా ఉండాలంటే జీవ, నిర్జీవ వస్తువులలో సమతుల్యత ఉండాలి. అంటే మనుషులు, జంతువులు, చెట్లు, నీరు, భూమి, గాలి లాంటి వాటిని కాలుష్యం చేయవద్దు. ప్రతి ఒక్కరూ అడవులను రక్షించడానికి, మొక్కలు పెంచడానికి కృషి చేయాలి. వాతవరణాన్ని కాలుష్యం చేయకుండా ఉండటానికి విరివిగా మొక్కలు నాటాలి. అడవులను కాపాడుకోవాలి.

– హఫీజొద్దీన్, ఫారెస్ట్ రేంజ్ అధికారి

అత్యాచారం కేసులో పదేళ్ల జైలు

రెబ్బెన(ఆసిఫాబాద్): అత్యాచారం కేసులో నిందితుడికి పదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.6,500 జరిమానా విధిస్తూ ఆసిఫాబాద్ జిల్లా సెషన్ కోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎంవీ రమేశ్ మంగళవారం తీర్పునిచ్చారు. రెబ్బెన సీఐ చిట్టిబాబు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రోళ్లపాడు గ్రామానికి చెందిన రెబ్బన సుధాకర్ తాండూర్ మండలంలోని గోపాల్‌నగర్‌కు చెందిన ఒక మహిళను పెళ్లి చేసుకుంటానని నమ్మించి శారీరకంగా లొంగదీసుకున్నాడు. ఆపై నిరాకరించటంతో బాధితురాలు 2020 మార్చి 5న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఐవోలు రమేశ్, అశోక్, సతీష్ నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో హాజరుపర్చారు. పీపీ జగన్మోహన్‌రావు సాక్షులను విచారించగా నేరం రుజువు కావడంతో పైవిధంగా శిక్ష ఖరారు చేశారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

బోథ్: మండలంలోని కోట కె గ్రామానికి చెందిన జల్కె ఆకాష్(20) పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడినట్లు ఎస్సై రాము తెలిపారు. ఆకాష్ కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు. మంగళవారం మద్యం మత్తులో పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు బోథ్‌లోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుని భార్య అనసూయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కరించాలి



జీఎం సంజీవరెడ్డికి వినతిపత్రం ఇస్తున్న ఏఐటీయూసీ నాయకులు

శ్రీరాంపూర్: సింగరేణి ఎస్అండ్‌పీసీ డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డుల సమస్యలు పరిష్కరించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శి ముస్కె సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్కె బాజీసైదా మంగళవారం శ్రీరాంపూర్ జీఎం సంజీవరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంటీఎఫ్ టీంలో సుదీర్ఘకాలంగా పనిచేస్తున్న వారిని వెంటనే తీసివేసి కొత్త వారికి అవకాశం కల్పించాలన్నారు. ఇందులో పనిచేస్తున్న కాంట్రాక్ట్ సెక్యూరిటీ సిబ్బందిని పూర్తిగా తొలగించాలన్నారు. అన్ని చెక్ పోస్టుల వద్ద కూర్చోవడానికి కుర్చీలు ఏర్పాటు చేయాలన్నారు. ఇందారం ఓపెన్ కాస్ట్ గని వద్ద కంటైనర్ చెక్ పోస్టును తీసివేసి నూతన చెక్ పోస్టును ఏర్పాటు చేయాలన్నారు. ఏరియా వర్క్ షాప్, ఇందారం గేటు వద్ద అదనపు గార్డును ఏర్పాటు చేయాలన్నారు. ఆ యూనియన్ ఫిట్ సెక్రటరీ ఆడెపు మల్లికార్జున్, నాయకులు నరసింహారావు, సింహాచలం అశోక్, సత్తయ్య, రాజేంద్రప్రసాద్, కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రీజియన్ కార్యదర్శి అఫ్రోజ్ ఖాన్ పాల్గొన్నారు.

నీట్‌లో 'నవోదయ' విద్యార్థుల ప్రతిభ



మేడి చంద్రకిరణ్



దాసరి సహస్ర



పవన్ జ్యోత్

కాగజ్‌నగర్‌రూరల్: పట్టణంలోని జవహర్ నవోదయ విద్యాలయానికి చెందిన విద్యార్థులు నీట్ పరీక్షలో ప్రతిభ కనబర్చారని నవోదయ విద్యాలయం ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు. కుమురం పవన్‌జ్యోత్ 720 మార్కులకుగానూ 511 సాధించగా ఎస్టీ కేటగిరీలో 2,568, జాదవ్ సంజీవ్ 453 మార్కులు సాధించగా 5,228, చౌహాన్ 432 మార్కులు సాధించగా 6,690, తిలక్ 377 మార్కులు సాధించగా 11,657, సోయం 358 మార్కులు సాధించగా 13,776 ర్యాంకు, శ్రీనిత్య 328 మార్కులు సాధించగా 17,891 ర్యాంకు సాధించినట్లు ఆయన పేర్కొన్నారు. కాగజ్‌నగర్ పట్టణానికి చెందిన మేడి చరణ్‌దాస్, వసంత దంపతుల కుమారుడు మేడి చంద్రకిరణ్ 522 మార్కులు సాధించగా ఎస్సీ కేటగిరీలో 10,172 ర్యాంకు సాధించాడు. దాసరి లక్ష్మణ్–మమత దంపతుల కుమార్తె సిరిసహస్ర 720 మార్కులకుగానూ 560 సాధించగా బీసీ కేటగిరీలో 60,921 ర్యాంకు సాధించింది. ర్యాంకులు సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ అభినందించారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు రాయితీ మంజూరు



జిల్లా కేంద్రంలోని పీఎంఎఫ్‌ఎంఈ పథకం మిల్లెట్ స్టోర్

పాతమంచిర్యాల: ప్రధానమంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఎంటర్‌ప్రైజెస్(పీఎంఎఫ్ఎంఈ) పథకంలో ఏర్పాటు చేసుకున్న ఆహార శుద్ధి పరిశ్రమలకు ప్రభుత్వం రాయితీ నిధులు విడుదల చేసింది. ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు, నిరుద్యోగులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు బ్యాంకుల ద్వారా రుణాలు పొంది యూనిట్లు ఏర్పాటు చేసుకున్న వారికి ప్రభుత్వం 35శాతం రాయితీ కల్పిస్తోంది. అందులో కేంద్రం వాటా 60శాతం కాగా, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం ఇస్తుంది. జిల్లాలో 258 యూనిట్లకు గాను 168 యూనిట్లకు రూ.13.65 కోట్ల సబ్సిడీ నిధులు మేలో ప్రభుత్వం విడుదల చేసింది. ఆ నిధులు లబ్ధిదారుల ఖాతాలలో జమ చేయనున్నట్లు జిల్లా పరిశ్రమల కేంద్రం అధికారులు, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు తెలిపారు. ఈ యూనిట్లను ఔత్సాహికులు స్థాపించుకోవాలంటే యూనిట్ విలువలో 10శాతం వాటాధనం సమకూరిస్తే యూనిట్ విలువ ఆధారంగా బ్యాంకు రుణం మంజూరు చేస్తుంది. రుణ కిస్తులు క్రమం తప్పకుండా చెల్లిస్తే ప్రభుత్వం 35శాతం సబ్సిడీ మంజూరు చేస్తుంది. వ్యక్తిగత యూనిట్లకు రూ.లక్ష నుంచి రూ.10 లక్షల వరకు రుణం పొందవచ్చు. బృందంగా ఏర్పడి నెలకొల్పితే రూ.3 కోట్ల వరకు రుణం లభిస్తుంది. వడ్డీ 6 నుంచి 7శాతంగా ఉంటుంది. ప్రతీయేటా యూనిట్ల స్థాపనకు పరిశ్రమల శాఖ అధికారులు లక్ష్యాలు ఏర్పాటు చేసుకుంటారు. 2023–24 సంవత్సరానికి 200 యూనిట్లు లక్ష్యంగా నిర్ణయించగా 168 ఏర్పాటయ్యాయి. బేకరి ఉత్పత్తులు, ఫ్లోర్‌మిల్లులు, మినీ రైస్‌మిల్లులు, బియ్యం, పాలు, పాల ఉత్పత్తులు కూరగాయలు, చింతపండు, టోమాటో జ్యూస్‌లు, కెచప్‌లు, ఐస్‌క్రీం, కుల్ఫీ, పాపడ్, స్వీట్, మిల్లెట్ ఉత్పత్తులు, పౌల్ట్రీ, తేనే, బెల్లం తయారీ, సుగంధ ద్రవ్యాలు, చెరుకు, నూనెగింజల ఆధారిత ఉత్పత్తుల యూనిట్లకు రాయితీ రుణాలు రుణాలు అందించనున్నారు. మహిళా సంఘాల సభ్యులు పచ్చళ్లు, అప్పడాల తయారీ, ఫ్లోర్‌మిల్‌లు పాల ఉత్పత్తి యూనిట్‌లు ఏర్పాటు చేసుకున్నారు.

చిన్న పరిశ్రమలకు చేయూత

చిన్న పరిశ్రమలకు చేయూత అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం మైక్రోఎంటర్‌ప్రైజెస్‌కు రాయితీలు నిధులు విడుదల చేస్తుంది. ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లు స్థాపించుకున్న వారు రుణాలు సక్రమంగా చెల్లిస్తేరుణంపై రాయితీ పొందవచ్చు. – రాఘవేందర్, డీఆర్‌డీ, జిల్లా పరిశ్రమల కేంద్రం మంచిర్యాల

వంశీకృష్ణకు ఘన సన్మానం



వంశీకృష్ణను సన్మానిస్తున్న నాయకులు

పాతమంచిర్యాల: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పెద్దపల్లి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి భారీ మెజార్టీతో విజయం సాధించిన గడ్డం వంశీకృష్ణను మంగళవారం జిల్లా కేంద్రంలో ఘనంగా సన్మానించారు. తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ కొమ్ము అశోక్ ఆధ్వర్యంలో నాయకులు పూలమాలలు, శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కేవీ ప్రతాప్, కొమ్ము శ్రీనివాస్ యాదవ్, బూక్య తిరుమల, దాడి తిరుపతి, ఫకృద్దీన్, సత్తిరెడ్డి, భాస్కర్, తదితరులు పాల్గొన్నారు.

గుట్కా పట్టివేత



గుట్కా, నిందితుడితో పోలీసులు

ఇచ్చోడ: మండల కేంద్రంలో మంగళవారం సాయంత్రం గుట్కా విక్రయిస్తున్న అబ్రార్ అహ్మద్‌ను పట్టుకున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు. అతని వద్ద నుంచి రూ.2.80 లక్షల విలువైన గుట్కా స్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు.

అక్రమంగా తరలిస్తున్న కలప పట్టివేత

నేరడిగొండ: అక్రమంగా ఆటోలో తరలిస్తున్న కలప దుంగలను ముందస్తు సమాచారం మేరకు అటవీ శాఖ అధికారులు పట్టుకున్నారు. మంగళవారం ఉదయం తర్నం నుంచి కుమారి గ్రామానికి ఆటోలో 13 టేకు దుంగలు తరలిస్తుండగా పట్టుకున్నారు. వీటి విలువ సుమారు రూ.60వేల వరకు ఉంటుందని నేరడిగొండ ఎఫ్ఆర్ వో గణేశ్ తెలిపారు. ముల్తానీలైన అబ్రార్, ఇంతియాజ్‌ల వద్ద నుంచి కుమారి గ్రామానికి చెందిన పురుషోత్తం అనే వడ్రంగి తర్నం గ్రామానికి చెందిన ఎ.ఫణీందర్ అనే వ్యక్తి ఆటోలో తరలిస్తుండగా పట్టుకొని కలపను స్వాధీనం చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశారు.

అభ్యర్థుల కంటే నోటాకే అధికం

- పార్లమెంట్ పరిధిలో నోటాకు నాలుగో స్థానం
- మొత్తంగా 11,762 ఓట్లు నమోదు

ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా నోటాకు పోలైన ఓట్లు

సిర్పూర్	2,017
ఆసిఫాబాద్	2,717
ఖానాపూర్	1,653
ఆదిలాబాద్	1165
బోథ్	1,557
నిర్మల్	1,156
ముథోల్	1,385

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పార్లమెంట్ నియోజకవర్గానికి మొత్తం 12 మంది అభ్యర్థులు పోటీ చేశారు. ఇందులో బీజేపీ, బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రధాన పార్టీల అభ్యర్థులను మినహాయిస్తే ఇతర పార్టీలు, స్వతంత్రులుగా పోటీ చేసిన అభ్యర్థులు కనీస పోటీ ఇవ్వలేకపోయారు. ప్రజల మద్దతును పొందడంలో విఫలమైన ఆ తొమ్మిది మంది అభ్యర్థులు డిపాజిట్లు కూడా కోల్పోయారు. వారికి పోలైన ఓట్ల కంటే నోటాకు వచ్చిన ఓట్లే అధికంగా ఉండడం విశేషం. బీఎస్పీ అభ్యర్థి మేస్రం జంగుబాపుకు 6,744 ఓట్లు రాగా, గోండ్వాన దండకారణ్య పార్టీ అభ్యర్థి కొడప వామన్‌రావుకు 1,685, ధర్మ సమాజ్ పార్టీ అభ్యర్థి మేస్రం గంగాదేవికి 3,468, ఇండియా ప్రజాబంధు పార్టీ తరఫున పోటీ చేసిన గేడం సాగర్‌కు 1,545, అన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి చౌవాన్ సుదర్శన్‌కు 4,644, విద్యార్థుల రాజకీయ పార్టీ అభ్యర్థి ఎస్.తిరుపతికి 2,292, అలయన్స్ ఆఫ్ డెమొక్రటిక్ రిఫాంస్ అభ్యర్థి మాలోత్ శ్యాంలాల్ నాయక్‌కు 7,499, ఇండిపెండెంట్ అభ్యర్థులైన బుక్యా జైవంత్ రావు 6,446, రాథోడ్ సుభాష్‌కు 6,521 ఓట్లు పోలయ్యాయి. వీరి కంటే అత్యధికంగా నోటాకు 11,762 ఓట్లు పోలయ్యాయి. పోస్టల్ బ్యాలెట్ ఓట్లు ప్రధాన పార్టీల అభ్యర్థులతో పాటు ఇతరులకు సైతం దాఖలు కావడం గమనార్హం. ఇందులో పోస్టల్ బ్యాలెట్ ద్వారా 112 మంది ప్రభుత్వ ఉద్యోగులు సైతం ఓటు వేయడం గమనార్హం. ఇదిలా ఉంటే 841 పోస్టల్ బ్యాలెట్ ఓట్లు తిరస్కరణకు గురయ్యాయి. ఓటు వేయడంలో ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల్లోని అవగాహన రాహిత్యానికి మరోసారి నిదర్శనంగా నిలిచింది. అత్యధికంగా ఆసిఫాబాద్ నియోజకవర్గంలో 2,717 ఓట్లు నోటాకు రాగా, అత్యల్పంగా నిర్మల్ నియోజకవర్గంలో 1,156 ఓట్లు పోలవ్వడం విశేషం.

వివరాలతో కూడిన సీఎంపీఎఫ్ స్లిప్పులు ఇవ్వాలి



వినతిపత్రం ఇస్తున్న నాయకులు

రెబ్బెన(ఆసిఫాబాద్): సింగరేణి కార్మికులకు పూర్తి వివరాలతో కూడిన సీఎంపీఎఫ్ స్లిప్పులు అందించాలని ఏఐటీయూసీ ఫిట్ కార్యదర్శి మారం శ్రీనివాస్ అన్నారు. ఖైరిగూడ ఓసీపీతోపాటు గోలేటి సీహెచ్‌పీ, ఏరియా వర్క్‌షాప్‌లో సీఎంపీఎఫ్ సమస్యలపై మంగళవారం ఉన్నతాధికారులకు వినతిపత్రాలు అందించారు. ఆయన మాట్లాడుతూ ఏరియాలో పనిచేసే ఉద్యోగులకు 2022– 23 సంవత్సరానికి సంబంధించి పూర్తి వివరాలతో కూడిన సీఎంపీఎఫ్ స్లిప్పులు అందించాలన్నారు. ఉద్యోగులు తమ ఆర్థిక అవసరాల కోసం సీఎంపీఎఫ్ లోన్ కోసం దరఖాస్తు చేసుకుని నెలలు గడుస్తున్నా లోన్ డబ్బులు అందడం లేదన్నారు. వివిధ అవసరాల కోసం ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. అధికారులు సీఎంపీఎఫ్ సమస్యలకు సత్వర పరిష్కారం చూపాలని కోరారు. అలాగే గుర్తింపు సంఘం ఎన్నికలు పూర్తయి నెలలు గడుస్తున్నా యాజమాన్యం గుర్తింపు పత్రం అందించకపోవడంతో స్ట్రక్చర్ కమిటీ, ఏరియా కమిటీ, జీఎం కమిటీ సమావేశాలు జరగడం లేదన్నారు. కార్పొరేట్ స్థాయిలోనూ అనేక సమస్యలు పెండింగ్‌లో ఉంటున్నాయని తెలిపారు. కార్యక్రమాల్లో ఆర్గనైజింగ్ కార్యదర్శులు రాజేశ్, కిరణ్‌బాబు, శేషు, దివాకర్, ఫిట్ కార్యదర్శులు రామయ్య, అశోక్, సహాయ కార్యదర్శి ఓదెలు, నాయకులు నరేశ్, కోటి తదితరులు పాల్గొన్నారు.

పిడుగుపాటుకు పశుగ్రాసం దగ్ధం

సారంగపూర్: మండలంలోని యాకర్‌పెల్లిలో మంగళవారం సాయంత్రం ఉరుములు, మె రుపులతో కురిసిన వర్షానికి పిడుగు పడి పశుగ్రాసం దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం పడిగెల కేదారినాథ్, పడిగెల సత్యనారాయణకు చెందిన దాదాపు 600ల గడ్డికట్టలను గ్రామ సమీపంలో గల పంటచేనులో కుప్పగా ఉంచారు. వాటిపై పిడుగు పడడంతో గడ్డికి నిప్పంటుకుని కాలిపోయింది. పశుగ్రాసం విలువ దాదాపు రూ.8వేల వరకు ఉండవచ్చని గ్రామస్తులు తెలిపారు.

పిడుగుపాటుకు ఆలయ గోపురం ధ్వంసం

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. చిచ్‌ధరి గ్రామ పంచాయతీ పరిధిలోని సేవాదాస్‌నగర్‌లో గల హనుమాన్ ఆలయ గోపురంపై పిడుగు పడింది. దీంతో గోపురం కొంత మేర ధ్వంసమైంది. సమీపంలో ఎవరూ లేకపోవడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు.

గాలి దుమారంతో ఆగమాగం..



హాజీపూర్ శివారులో విరిగిన విద్యుత్ స్తంభం



దొనబండలో నేలకొరిగిన చెట్లు

మండలంలో మంగళవారం మధ్యాహ్నం ఒక్కసారిగా గాలి దుమారంతో భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులకు పలుచోట్ల చెట్లు నేలకొరగగా విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. దీంతో పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రేకుల షెడ్లు కూలిపోగా ఇళ్ల పైకప్పులన్నీ ఎగిరిపోయాయి. విద్యుత్ అధికారులు సకాలంలో స్పందించినా సాయంకాలం వరకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించలేకపోయారు. – మంచిర్యాలరూరల్(హాజీపూర్)



దొనబండలో కొట్టుకుపోయిన ఇంటి పైకప్పు